క్లుప్తంగా

కాల్వ అభివృద్ధి పనుల పరిశీలన



కె.పొన్నవరం(పెనుగంచిప్రోలు): గ్రామంలో కాల్వ అభివృద్ధి పనులను గురువారం ఎంపీపీ మార్కపూడి గాంధీ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామం పక్క నుంచి పొలాలకు నీళ్లు వెళ్లే కాలువ పూడిక, కంప, చెత్తతో నిండిపోయిందన్నారు. దీంత సమస్య పరిష్కారానికి స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను సహకారంతో కాలువ పూడికతీతోపాటు పక్కాగా కాలువ నిర్మాణం చేపడతామని వివరించారు.

రేపట్నుంచి రామకోటి మహోత్సవాలు



నందిగామ: స్థానిక సీతారామాంజనేయస్వామి వారి ఆలయంలో ఈనెల 16వ తేదీ నుంచి 21వతేదీ వరకు 71వ రామకోటి మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు దివి రత్నమాచార్యులు తెలిపారు. రామకోటి మహోత్సవాల ఆహ్వాన పత్రికను గురువారం ఆవిష్కరించారు. మొదటిరోజు విశేషపూజలతోపాటు శ్రీనివాస కల్యాణం, 17న సువర్చల ఆంజనేయస్వామి కల్యాణం, 18న శివపార్వతుల కల్యాణం, 19న సీతారామ కల్యాణం, 20, 21వతేదీల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీతారామ నామ సంకీర్తన సంఘ సభ్యులు పాల్గొన్నారు.

రూ.6.40 లక్షల జరిమానా

అల్లూరు(వీరులపాడు):విద్యుత్ చౌర్యానికి పాల్పడితే సహించేది లేదని విజిలెన్స్ ఈఈ కమలకుమారి హెచ్చరించారు. మండలంలోని అల్లూరు విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో గురువారం ఆమె మాట్లాడుతూ మండలంలోని 26 గ్రామాల్లోని 2,757 సర్వీస్ మీటర్లను క్షుణ్ణంగా తనిఖీ చేసినట్లు చెప్పారు. ఈ పరిశీలనలో అధికలోడు వినియోగిస్తున్న 219 మందిని గుర్తించి వారికి రూ.6.40లక్షలను జరిమానాగా విధించినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో 35 బృందాలు పాల్గొన్నాయని వివరించారు. డీఈఈ శ్రీనివాసరావు, విజిలెన్స్ ఏడీఈలు నవీన్‌కుమార్, సుధాకర్, శ్రీనివాసరావు, కొండలరావు,ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రామ్‌కో సేవలు అభినందనీయం



రావిరాల(జగ్గయ్యపేట): రామ్‌కో సిమెంట్స్ కర్మాగారం గ్రామాల అభివృద్ధికి అందిస్తున్న సహకారం అభినందనీయమని ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను పేర్కొన్నారు. రావిరాల ఎస్సీకాలనీలో సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన ఆర్‌వో ప్లాంట్, మూడు కిలోమీటర్ల మేర నిర్మించిన డొంక రోడ్డును కర్మాగారం ప్రెసిడెంట్ ఆశిష్‌కుమార్ శ్రీవాత్సవ్‌తో కలిసి గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ 35ఏళ్లుగా రామ్‌కో యాజమాన్యం కర్మాగారాన్ని ప్రారంభించి ఈ ప్రాంతాన్ని అభివృద్ధికి చేస్తోందన్నారు. పేటలో టీటీడీ కల్యాణ మండపానికి రామ్‌కో యాజమాన్యం సహకారం అందించారని గుర్తుచేశారు. సర్పంచి నరసింహారావు, రామ్‌కో సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మూర్తిరావు, హెచ్ఆర్ డీజీఎం రామసాయి, కౌన్సిలర్ సామినేని వెంకటకృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పోలీసు కవాతు



నందిగామ: మండలంలోని కొండూరు, రామిరెడ్డిపల్లి, జొన్నలగడ్డ , కొణతమాత్మకూరు గ్రామాల్లో గురువారం రాత్రి పోలీసులు కవాత నిర్వహించారు. ఈసందర్భంగా ఇన్‌స్పెక్టర్ హనీష్ మాట్లాడుతూ ప్రతిగ్రామంలో పోలీసు సిబ్బంది, ప్రత్యేక పోలీసు బలగాలతో కవాతు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్రజలకు ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పించడంతోపాటు ప్రతిఒక్కరిలో మనోధైర్యాన్ని నింపేలా గ్రామసభలు నిర్వమిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎస్సై దుర్గా మహేశ్వరరావు , ప్రత్యేక పోలీసులు పాల్గొన్నారు.

ముగిసిన పరీక్షలు

జగ్గయ్యపేట అర్బన్: ఇంటర్మీయట్ ప్రధమ సంవత్సరం పరీక్షలు పట్టణంలో గురువారంతో ముగిశాయి. పట్టణంలో ఎస్‌జీఎస్, వాగ్దేవి, జేఆర్సీ, అమ్మాజీ కళాశాలల్లో నిర్వహిస్తున్న ఫస్టియర్ పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు ఇంటర్మీడియట్ పరీక్షల విభాగం కస్టోడియన్ శౌరిలమ్మ తెలిపారు. మొత్తం 1400 మంది విద్యా ర్థులు పరీక్షలకు హాజరైనట్లు వివరించారు.

అభివృద్ధి పథంలో గ్రామాలు



నందిగామలో మోటార్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు



కేతవీరునిపాడులో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గ్రామీణ ప్రాంతాలు అన్నిరంగల్లో అభివృద్ధి చెందాయని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని కేతవీరునిపాడు గ్రామంలో రూ.99లక్షలతో చేపట్టిన ఇంటింటికీ కుళాయి కనెక్షన్, కల్వర్టులు, హిందూ శ్మశానవాటిక ప్రహరీ నిర్మాణ పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో మౌలికవసతుల కల్పనకు తాను కృషిచేసినట్లు వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అరిగెల సుందరమ్మ, వైస్ ఎంపీపీ అన్నం పిచ్చయ్య, నాయకులు నెలకుదిటి శివనాగేశ్వరరావు, ఐలపోగు రామయ్య, నెలకుదిటి మహేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

రైతులకు మోటార్లు.. మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ

నందిగామ మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు గురువారం 20మంది మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. జలకళ పథకం కింద రైతులకు మంజూరైన రూ.2లక్షల విలువగా మోటార్లు, పైపులైన్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే జగన్ మోహనరావు మాట్లాడుతూ మహిళలు కుట్టుమిషన్లను సద్వినియోగం చేసుకుని ఆర్థికస్వావలంభన సాధించాలని సూచించారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీపీ ఆకుల రంగా, వైస్ ఎంపీపీ అన్నం పిచ్చయ్య, నాయకులు నెలకుదిటి శివనాగేశ్వరరావు, షేక్ కరిముల్లా, సూరా కొండ, షేక్ యాకుబ్ అలీ పాల్గొన్నారు.

రూ.5.26 కోట్లతో అభివృద్ధి పనులు..



చందర్లపాడు(నందిగామ టౌన్): మండలంలోని చింతలపాడులో రూ.43.40లక్షలతో నిర్మించిన సచివాలయం, రూ.23.94లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు బుధవారం రాత్రి ప్రారంభించారు. మండల పరిషత్ నిధులు రూ.10లక్షలతో చేపట్టిన సీసీ డ్రెయిన్ పనులు, జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా రూ.1.44 కోట్లతో చేపడుతున్న ఇంటింటికీ తాగునీటి కుళాయి కనెక్షన్ ఏర్పాటు పనుకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామంలోని లబ్ధిదారులకు ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేశారు.

వెలదికొత్తపాలెంలో..

మండలంలోని వెలదికొత్తపాలెంలో జలజీవన్ మిషన్ పథకం కింద రూ.1.76 కోట్లతో చేపట్టిన ఇంటింటికీ కుళాయి కనెక్షన్ పనులు, రూ.20లక్షలతో చేపట్టిన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే జగన్‌మోహనరావు శంకుస్థాపన చేశారు. అనంతరం ఎన్ఆర్‌యుఎం నిధులు రూ.20లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. అదేవిధంగా విభరింతపాడులో రూ.89.50లక్షలతో చేపట్టిన పైప్‌లైన్ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ గుడేటి నాగమల్లేశ్వరీ, జడ్పీటీసీ సభ్యుడు ముక్కపాటి నరసింహారావు, సర్పంచులు షేక్ జానీ, మోహన్‌రెడ్డి, నాయకులు వైఎస్ఎన్ ప్రసాద్, కందుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

600 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ



బూదవాడలో లబ్ధిదారులకు ఇళ్లపట్టాలు పంపిణీ చేస్తున్న విప్ ఉదయభాను, నాయకులు

బూదవాడ(జగ్గయ్యపేట): టీడీపీ, జనసేన, బీజేపీలు కూటమిగా ఏర్పడి పేదలను మరోసారి మోసం చేసేందుకు యత్నిస్తున్నాయని జగ్గయ్యపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను విమర్శించారు. మండలంలోని బూదవాడ గ్రామంలో నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకం కింద 600మంది లబ్ధిదారులకు గురువారం రాత్రి ఆయన రిజిస్ట్రేషన్ ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విప్ ఉదయభాను మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు పేరు చెబితే అక్కాచెల్లెమ్మలకు చేసిన వంచన, పొదుపుసంఘాల మహిళలకు చేసిన దగా గుర్తుకువస్తోందన్నారు. చంద్రబాబు దత్తపుత్రుడి చర్యలు వివాహ వ్యవస్థనే భ్రష్టుపట్టించేలా ఉన్నాయని విమర్శించారు. ఎవరు ఎన్ని కూటములు ఏర్పాటు చేసినా రానున్న ఎన్నికల్లో తమ వైఎస్సార్ సీపీ మరోసారి ఘనవిజయం సాధిస్తుందని వివరించారు. అనంతరం శివారు గ్రామం రెడ్డినాయక్ తండాలో నాడు–నేడు పథకంలో కింద ప్రభుత్వ పాఠశాలలో 15.99లక్షలతో నిర్మించిన అదనపు తరగతి గదులను ఉదయభాను ప్రారంభించారు. కార్యక్రమంలో నెడ్‌కాప్ చైర్మన్ వేల్పుల రవికుమార్, మండల పార్టీ కన్వీనర్ మండల్ శ్రీనివాస్‌గౌడ్ , గ్రామ పార్టీ నాయకులు బాల్యానాయక్, గడ్డం శ్రీను, రామిశెట్టి భద్రాచలం, పరిటాల వెంకటేశ్వర్లు, సైదా తదితరులు పాల్గొన్నారు.

చింతలపాడులో వైఎస్సార్ సీపీ సందడి



ర్యాలీలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు



డ్యాన్స్ చేస్తున్న యువత, గ్రామస్తులు

చందర్లపాడు(నందిగామ టౌన్): ఆయా అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి బుధవారం రాత్రి చింతలపాడు విచ్చేసిన నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితో జగన్‌మోహనరావుకు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. మహిళలు ఎమ్మెల్యేకు హారతులిచ్చి ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి భారీ ర్యాలీగా బయలుదేరిన వైఎసార్ సీపీ నాయకులు, కార్యకర్తలు గ్రామంలో పార్టీ జెండాలు చేతబూని డ్యాన్స్‌లు చేస్తూ సందడి చేశారు.

గండివాగులో తూటికాడ తొలగింపు



వాగు కల్వర్టుపై పేరుకుపోయిన తూటుకాడ(ఫైల్)



పూడికతీత అనంతరం గండివాగు

ముండ్లపాడు(పెనుగంచిప్రోలు):మండలంలోని ముండ్లపాడులోని గండివాగు పూడికతీత పనులు చేపట్టారు. గండివాగు తూటుకాడతో నిండిపోవడంతోపాటు ఏటా వర్షాకాలం గ్రామస్తులు ఎన్నో ఇబ్బందులు పడేవారు. వర్షాలకు వాగులో వరద నీరు పోటేసి సమీపంలోని ఇళ్లల్లోకి, పొలాల్లోకి వస్తుండటంతో పంట నష్టంతో పాటు గ్రామస్తులు అనేక అగచాట్లు పడేవారు. రోడ్డుపై నీరు నిలుస్తుండటంతో రాకపోకలు నిలిచిపోయేవి. ఈ నేపథ్యంలో విప్ సామినేని ఉదయభాను సమస్య పరిష్కారం కోసం డీఎంఎఫ్ నిధులు రూ.25లక్షలు మంజూరు చేయించి వాగులో తొమ్మిది కిలోమీటర్ల మేర పూడికతీత, పక్కన కట్టలు గట్టిగా వేసే పనులు చేయిస్తున్నారు. దీంతో ఎన్నో ఏళ్లుగా ఉన్న సమస్య పరిష్కారమైందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు

జుజ్జూరు(వీరులపాడు): విధి నిర్వహణలో అలసత్వం వహించే బీఎల్వోలపై చర్యలు తప్పవని తహసీల్దార్ రాజకిషోర్ హెచ్చరించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఎన్నికల విధులపై బీఎల్వోలతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద మౌలికవసతులు కల్పించాలన్నారు. ఓటర్లంతా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా వారికి అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ ఆంజనేయులు, ఆర్ఐ శివప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

మసీదు మరమ్మతులకు ఆర్థికసాయం



పరిటాల(కంచికచర్ల) : ముస్లిం మైనార్టీలకు అన్నిరంగాల్లో పెద్దపీట వేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముస్లింలంతా మరోసారి ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకుడు దుబాయ్ కరీముల్లా పిలుపునిచ్చారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని మండలంలోని పరిటాల పెద్ద మసీదు మరమతులు, ఆధునికీకరణ పనుల కోసం ఆయన రూ.50వేలను ముస్లింపెద్దలకు గురువారం అందజేశారు. ఈసందర్భంగా దుబాయ్ కరీముల్లా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముస్లిం మైనార్టీలకు రాజకీయాలలో సముచితస్థానం కల్పించారన్నారు. నందిగామ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు స్ఫూర్తితో తనవంతుగా సేవ చేయాలని ఆలోచనతో ఆర్థికసాయం అందించినట్లు తెలిపారు. గ్రామానికి చెందిన నాగుల్‌షరీఫ్ బ్రెయిన్ ఫీవర్‌తో బాధపడుతున్న విషయం తెలుసుకుని అతనికి ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చింతా రవీంద్రనాథ్, మార్త శ్రీనివాసరావు, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ సమావేశం

నందిగామ: నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం స్థానిక పాత బైపాస్‌రోడ్డులోని షాలేము ప్రార్థనా మందిరంలో గురువారం జరిగింది. కౌన్సిల్ ఆధ్వర్యంలో రాబోయే రోజుల్లో నిర్వహించనున్న కార్యక్రమాలపై చర్చించారు. నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు జార్జిముల్లర్, డైరెక్టర్ తేజస్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు హనోక్, సభ్యులు పాల్గొన్నారు.

రైతుల పక్షపాతి సీఎం జగన్



చిట్టేలలో ఆర్బీకేను ప్రారంభిస్తున్న ఎంపీ నాని, విప్ సామినేని ఉదయభాను



రామచంద్రునిపేటలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న విప్ ఉదయభాను

చిట్టేల(వత్సవాయి) : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రైతుల పక్షపాతిగా ఉంటూ వారి అభ్యున్నతికి కృషిచేస్తున్నారని విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని), జగ్గయ్యపేట ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను పేర్కొన్నారు. చిట్టేలలో రూ.24లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రం, రూ.20లక్షలతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని గురువారం వారు ప్రారంభించారు. ముందుగా గ్రామ శివారు నుంచి కార్యకర్తలతో కలసి ర్యాలీగా గ్రామానికి చేరుకుని ఎంపీ, ఎమ్మెల్యేలిద్దరూ స్థానిక మసీదు, దేవాలయం, చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గ్రామ ప్రధాన సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఎక్కడాలేని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలుచేస్తున్నారన్నారు. ప్రతి గ్రామంలో సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్ సెంటర్లు, అంగన్‌వాడీలు, సొసైటీ భవనాల నిర్మాణంతోపాటు పాఠశాలల అభివృద్ధి కళ్లెదుటే కనిపిస్తుంటే..టీడీపీ అధినేత చంద్రబాబుకు ఇవేమి కనిపించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు . ఆయా ప్రభుత్వ పథకాల ద్వారా డీబీటీ, నాన్‌డీబీటీ రూపంలో చిట్టేల గ్రామస్తులకు రూ.40 కోట్ల మేర లబ్ధిచేకూరిందని చెప్పారు. జగ్గయ్యపేటకు ప్యాసింజర్ రైలు మరికొద్ది నెలల్లో వస్తుందని, ఈ ఘనత సామినేని ఉదయభానుకే దక్కుతుందని ఎంపీ నాని ప్రశంసించారు. మాజీఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య ఏరోజు కూడా నియోజకవర్గ అభివృద్ధికి పనులు కావాలని తనను అడగలేదని ఎంపీ తెలిపారు. ప్రజల ఆశీర్వాదంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రిగా ఎన్నికవుతారని వివరించారు. అనంతరం జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్ పట్టాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్నెళ్ల పుల్లారెడ్డి బ్రదర్స్, నెడ్‌కాప్ చైర్మన్ వేల్పుల రవికుమార్, తిరుమలగిరి ఆలయ చైర్మన్ కొమరగిరి రవీంద్ర భరద్వాజ్, సర్పంచి జాల కోటేశ్వరరావు, ఎంపీటీసీ కొదమల తేజశ్రీ, ఎంపీపీ కొలుసు రమాదేవి, జెడ్పీటీసీ యేశపోగు దేవమణిశ్రీనివాస్, శింగవరం సర్పంచి పొన్నపూల ప్రశాంతి, సొసైటీ అధ్యక్షులు సుంకర సాంబశివరావు, మండల పార్టీ అధ్యక్షులు గుత్తా శంకరరావు, జిల్లా పార్టీ కార్యదర్శి గాదెల రామారావు, వత్సవాయి, పోలంపల్లి, మక్కపేట, మంగొల్లు సొసైటీ అధ్యక్షులు రంగిశెట్టి ముత్తయ్య, కాటేపల్లి రవి, కొండబోలు బ్రహ్మం, సామినేని లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రూ.1.08కోట్లతో అభివృద్ధి పనులు

రామచంద్రునిపేట(జగ్గయ్యపేట):రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో చేసిన అభివృద్ధిని ప్రజలు గమనించాలని ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను కోరారు. మండలంలోని రామచంద్రునిపేటలో రూ.40లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, రూ.75లక్షలతో నిర్మించిన రామచంద్రునిపేట–షేర్‌మహ్మద్‌పేట రోడ్డు, రూ.3.60 లక్షలతో నిర్మించిన డ్రైనేజీని బుధవారం రాత్రి ఆయన ప్రారంభించారు. అనంతరం విప్ ఉదయభాను శివారు గ్రామంగా ఉన్న రామచంద్రునిపేటను తాము అధికారంలోకి రాగానే ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. మాట్లాడుతూ ఐదేళ్లలో నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధిని చూసి మద్దతు పలకాలని ప్రజలను కోరారు. సర్పంచి యలమర్తి రామకృష్ణ, గ్రామ, మండల కన్వీనర్లు శ్రీనివాసరావు, శ్రీనివాసగౌడ్, ప్రసాద్, అనంతరామయ్య, ఆంజనేయులు, శ్రీనివాసరావు, సాయి పాల్గొన్నారు.

రాష్ట్రంలో సంక్షేమ విప్లవం

ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు



కంచికచర్లలో వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహన్‌రావు

కంచికచర్ల : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలుచేస్తూ రాష్ట్రంలో సంక్షేమ విప్లవాన్ని సృష్టించారని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. కంచికచర్లలో గురువారం ఆయన 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి గ్రామస్తులను ఆప్యాయంగా పలకరించారు. వారి యోగక్షేమాలతోపాటు సమస్యలను అడిగితెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలను వివరించి, ఆయా పథకాల అమలుతేదీలతో కూడిన క్యాలెండర్‌ను గ్రామస్తులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ లబ్ధి చేకూర్చుతున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఆయా పథకాల ద్వారా ప్రజలకు డీబీటీ, నాన్‌డీబీటీ రూపంలో ఇప్పటివరకు రూ.2.79లక్షల కోట్లను ప్రజలు అందించారని వివరించారు. అన్నివర్గాల సంతోషం, సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమన్నారు. దేశంలో మరేరాష్ట్రంలో లేనివిధంగా సంక్షేమ పథకాలను అమలుచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సి ఉందని పిలుపునిచ్చారు. ప్రజలంతా మరోసారి సీఎం జగనన్నను, వైఎస్సార్ సీపీని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ, మండల కన్వీనర్లు వేమా సురేష్‌బాబు, నన్నపనేని నరసింహారావు, సర్పంచి వేల్పుల సునీత, ఎంపీటీసీ సభ్యులు మాడుగుల మధుబాబు, నాయకులు వేల్పుల శ్రీనివాసరావు, దేవరకొండ గురవయ్య, నారిశెట్టి శ్రీనివాసరావు, ఎం.పాండు, శేషం మధుబాబు, శేషం అనిల్ కుమార్, మంగలపూడి కోటిబాబు, కె.డూండీ, వేల్పుల రమేష్, వీఆర్వో శేషం సురేష్‌బాబు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి చేరికలు



యువకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: ఎన్నడూ లేనివిధంగా సంక్షేమ పథకాల విప్లవంతో రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తున్న ముఖ్యమంత్రి జగనన్న పాలనకు ప్రభావితులైన ఎంతోమంది టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను అన్నారు. పేట మండలంలోని ధర్మవరప్పాడు గ్రామానికి చెందిన 7కుటుంబాలవారు గురువారం టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలోకి చేరారు. తన నివాసంలో ఉదయభాను వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. వైఎస్సార్ సీపీలో చేరినవారిలో గుంజా చంటి, గుగులోతు కైలాష్, నూనావత్ రవి, భూక్యా నవీన్, బాణావతు శ్రీను, తేజావత్ సైదా, ధీరావత్ వంశీ నాయక్, భూక్యా రంగా తదితరులు ఉన్నారు.

పౌష్టికాహారంతో రక్తహీనత నివారణ



బోదవాలో ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్ నందిని, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్యసిబ్బంది

బోదవాడ(వీరులపాడు): గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనత సమస్యను అధిగమించవచ్చని వైద్యాధికారి నందిని సూచించారు. బోడవాడ అంగనవాడీ కేంద్రం వద్ద గురువారం పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించారు. నందిని మాట్లాడుతూ గర్భిణులు బలవర్ధక ఆహారం తీసుకుంటే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని వివరించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంగనవాడీ కార్యకర్త తోట సుజాత, ఏఎన్ఎం ఇందిర పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన కార్యకర్తల కవ్వింపు చర్యలు

- వైఎస్సార్ సీపీ కార్యకర్తల ఇళ్లపై దాడులు
- షేర్‌మహ్మద్‌పేటలో ఘటన

షేర్‌మహ్మద్‌పేట(జగ్గయ్యపేట): టీడీపీ, జనసేన కార్యకర్తలు కవ్వింపు చర్యలకు పాల్పడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ కార్యకర్తల ఇళ్లపై దాడులకు దిగి బీభత్సం సృష్టించారు. ఈ ఘటన జగ్గయ్యపేట మండలంలోని షేర్‌మహ్మద్‌పేటలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. షేర్‌మహ్మద్‌పేటలో ఇటీవల క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సానుభూతిపరులు విజేతగా నిలిచారు. దీంతో బహుమతి ప్రదానం చేసేందుకు నిర్వాహకులు టీడీపీ మాజీఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) సోదరుడు చినబాబు వచ్చారు. ఆ సమయంలో టీడీపీ, జనసేన కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. ఆక్రమంలో గ్రంథాలయం సెంటర్ వద్దగల సైదిరెడ్డి బజారుకు టీడీపీ, జనసేన కార్యకర్తలు గుంటుపల్లి పవన్, గడ్డం సిద్దు, దేవరశెట్టి అజయ్, తులసి, చిన్న బ్రహ్మం, షేక్ బాజీ, షేక్ బాజీబాబా, చింతల నరేంద్ర, షేక్ మదార్‌షా, సయ్యద్‌బాషా, షేక్ నాగులు, ద్విచక్రవాహనాలతో ఫీట్లు కొట్టుకుంటూ వైఎస్సార్ కాంగ్రెస్ కార్యకర్తల ఇళ్ల వద్దకు వెళ్లారు. మద్యం మత్తులో ఉన్నవారు వారివద్ద ఉన్న ఖాళీ బీరు బాటిళ్లను ఇళ్లపై వేయడమేగాక రాళ్లు కూడా విసిరారు. అయితే అక్కడ ఉన్న మహిళలు ఎందుకు ఇలా చేస్తున్నారని అడగడంతో వారిపై దుర్భాషలాడుతూ వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నాయకులు చిల్లకల్లు పోలీసులకు సమాచారం అందించారు. ఈ నేపథ్యంలో టీడీపీ, జనసేన కార్యకర్తలు మరోసారి ఆ బజారుకు వచ్చే ప్రయత్నం చేయగా అక్కడే ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు వారిని మందలించారు. అదేసమయంలో పోలీసులు కూడా ఇరువర్గాలను చెదరగొట్టి పంపించేశారు. ఇది ఇలాఉండగా గురువారం ఉదయం గ్రామ టీడీపీ కార్యకర్తలు, మాపై వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు దాడులు చేశారంటూ రోడ్డుపై బైఠాయించారు. ఈ విషయం తెలుసుకున్న చిల్లకల్లు ఎస్ఐ సతీష్ అక్కడికి చేరుకుని వారితో మాట్లాడి పంపించివేయడంతోపాటు పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. బీరుబాటిళ్లు పగలగొట్టి, మహిళలపట్ల అసభ్యంగా ప్రవర్తించిన వారిని గుర్తించి కేసులు నమోదు చేస్తామని ఎస్సై తెలిపారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

మధురానగర్(విజయవాడసెంట్రల్):విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి విజయం సాధించాలని వాసవీక్లబ్ లక్ష్మీ సత్యనారాయణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎం.గోపాలకృష్ణ సూచించారు. మాచవరం వాణీ స్కూల్‌లో గురువారం వాసవీక్లబ్ లక్ష్మీసత్యనారాయణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాలు ఏర్పాటు చేసుకుని లక్ష్య సాధనకు కృషి చేయాలని సూచించారు. స్కూలు డైరెక్టర్ అంజూరు శేషుబాబు, సుబ్బారావు పాల్గొన్నారు.